సాక్షి
మంచిర్యాల
గురువారం । 2 । నవంబర్ । 2023



టీ హబ్ సేవలు అందేదెప్పుడు!

తెలంగాణ డయాగ్నోస్టిక్స్ కేంద్రం(టీ–హబ్)లో పూర్తి స్థాయిలో సేవలు అందడం లేదు. వైద్యులు, టెక్నీషియన్ల నియామకం లేకపోవడంతో కొన్ని పరీక్షలకే పరిమితమైంది. 10లో▸



తస్మాత్ జాగ్రత్త 10లో▸

రేపటి నుంచి అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ల పర్వం ప్రారంభం కానుంది. అభ్యర్థులు నామినేషన్ పత్రాలను సరిగా పూరించకుంటే తిరస్కరణకు గురయ్యే ప్రమాదం ఉంది.

గరిష్టం/కనిష్టం
32.0 /21.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఈశాన్యం దిశగా చలిగాలులు వీస్తాయి. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఎట్టకేలకు ధాన్యం సేకరణకు ఏర్పాట్లు

సాక్షి స్పందన

మంచిర్యాలఅగ్రికల్చర్: వానాకాలంలో సాగు చేసిన వరి ధాన్యం సేకరణకు ఎట్టకేలకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. గత నెల 29న 'ధాన్యం సేకరణపై ధ్యాసేది' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. గురువారం నస్పూర్‌లోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో ధాన్యం సేకరణపై సన్నాహాక సమావేశం నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. ఈ నెల రెండో వారం నుంచి కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు.

బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక



కండువా వేసి ఆహ్వానిస్తున్న సుమన్

మందమర్రిరూరల్: మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని 23వ వార్డు మారుతినగర్‌కు చెందిన పలువురు బుధవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. మారుతినగర్‌లో ప్రచారంలో భాగంగా ప్రభుత్వ విప్ బాల్క సుమన్ వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ పట్టణంలో అభివృద్ధి పనులను చూసి బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ఓటేసి తనను గెలిపించాలని కోరారు. 17వ వార్డులో అనారోగ్యంతో బాధ పడుతున్న నాయకుడు మద్దెల శంకర్‌ను పరామర్శించారు. టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య, పీఏసీఎస్ చైర్మన్ ప్రభాకర్‌రావు, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు రవీందర్, రాం వేణు, వెంకటేష్, మద్ది శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్, అధికారులపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు



ఫిర్యాదు చేసిన సభ్యులు

మంచిర్యాలటౌన్: జిల్లాలోని నస్పూరు మున్సిపాలిటీలో స్థానిక రియల్టర్లు, బీఆర్‌ఎస్ పార్టీకి లబ్ధి చేకూర్చేలా ప్రవర్తిస్తున్న కలెక్టర్, జిల్లా అదనపు కలెక్టర్లు, మంచిర్యాల ఆర్డీవో, నస్పూర్ తహసీల్దార్, నస్పూర్ మున్సిపల్ కమిషనర్‌లపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని స్వచ్ఛంద పౌర సేవా సమితి ప్రధాన కార్యదర్శి తులా మధుసూదన్‌రావు, ఉపాధ్యక్షుడు బల్ల శివశంకర్ బుధవారం రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. నస్పూరులోని కలెక్టరేట్ సమీపంలో 102 ఎకరాల మేరకు ప్రభుత్వ భూమి ఉందని, టీఎన్జీవో ఇంటి స్థలాలకు 29.38 ఎకరాలు కేటాయించిన కొంతభూమి తోపాటు 32.02 ఎకరాల భూమిని ఆక్రమించి, అనధికార నిర్మాణం చేస్తున్నారని, పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. అధికారులు ప్రత్యక్షంగా, పరోక్షంగా స్థానిక ప్రజాప్రతినిధులు, అనధికార బిల్డర్ల నుంచి బీఆర్‌ఎస్ పార్టీకి నిధుల సేకరణ కోసం కుమ్మక్కయ్యారని తెలుస్తోందని, ప్రభుత్వ ఆస్తులను కాపాడేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

దివ్యాంగ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థులతో ముచ్చటిస్తున్న డీఈవో

మంచిర్యాలఅర్బన్: దివ్యాంగ విద్యార్థులు ప్రభుత్వ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని డీఈవో యాదయ్య అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని భవిత కేంద్రాన్ని తనిఖీ చేశారు. జిల్లా సెక్టోరల్ అధికారి చౌదరి, సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్ దరఖాస్తు గడువు పెంపు

మంచిర్యాలఅర్బన్: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్‌ఎంఎంఎస్) పరీక్షకు ఆన్‌లైన్ దరఖాస్తు గడువు పెంచినట్లు డీఈవో యాదయ్య తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరం 8వ తరగతి విద్యార్థులు ఈ నెల 7లోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

కాక రేపిన వివేక్ రాక!

- కాంగ్రెస్‌లో చేరడంతో అనూహ్య పరిణామాలు
- చెన్నూరు నుంచి వివేక్ పోటీ
- జిల్లా రాజకీయాల్లో మారుతున్న సమీకరణాలు



మాజీ ఎంపీ వివేక్

గడ్డం వంశీకృష్ణ

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: అసెంబ్లీ ఎన్నికల వేళ జిల్లా రాజకీయాల్లో అనూహ్య పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. మాజీ ఎంపీ, బీజేపీ నాయకుడు వివేక్ వెంకటస్వామి కాంగ్రెస్ పార్టీలో చేరడం భారీ మార్పులకు దారి తీస్తున్నాయి. జిల్లా రాజకీయాల్లో కీలకంగా ఉన్న వివేక్ ఈ అసెంబ్లీ ఎన్నికల్లో మొదటి నుంచీ పోటీకి ఆసక్తి చూపలేదు. ఆయనే పెద్దపల్లి లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తానని, అసెంబ్లీకి పోటీ చేయనని స్వయంగా ప్రకటించారు. ఈ పరిస్థితులను గమనిస్తూనే బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు చెన్నూర్ అభ్యర్థుల పేర్లు ఇంకా ఖరారు చేయలేదు. తాజాగా పార్టీ మారి బీఆర్‌ఎస్ అభ్యర్థి బాల్క సుమన్‌పై పోటీకి వివేక్ సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. పార్టీలోకి మారిన రోజు కాకుండా మంచి రోజు చూసి అభ్యర్థిగా ప్రకటించనున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేస్తే డిప్యూటీ సీఎంగా అవకాశం ఉంటుందని అంటున్నారు. ఇక వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో పెద్దపల్లి ఎంపీగా తమ కుటుంబానికి చెందిన విశాఖ ఇండస్ట్రీస్‌కు జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉన్న వివేక్ తనయుడు గడ్డం వంశీక్రిష్ణను నిలబెట్టే ఆలోచనలు చేస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీతో తగిన హామీలు వచ్చే వరకు వేచి చూశాకే పార్టీ మారినట్లు తెలుస్తోంది.

అటు ఇటు తిరిగి కాంగ్రెస్ గూటికే..

జాతీయ స్థాయి రాజకీయాల్లో పేరున్న కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, తండ్రి గడ్డం వెంకటస్వామి(కాకా) వారసుడిగా రాజకీయాల్లోకి అడుగుపెట్టిన వివేక్ రాజకీయ జీవితంలో తక్కువ కాలంలోనే ఎక్కువ పార్టీలు మారారు. మొదట కాంగ్రెస్ నుంచి మొదలై 2009–2014 మధ్య పెద్దపల్లి ఎంపీగా ఉన్నారు. తర్వాత కాంగ్రెస్‌ను వీడి 2013లో అప్పటి టీఆర్‌ఎస్‌లో చేరారు. తర్వాత 2014లో కాంగ్రెస్, 2016లో మళ్లీ టీఆర్‌ఎస్, 2018లో బీజేపీ, తాజాగా మళ్లీ కాంగ్రెస్‌లో చేరారు. ఇటీవల పలుమార్లు పార్టీ మారడంపై వచ్చిన వార్తలను ఖండిస్తూనే చివరికి పార్టీని వీడారు.

సీపీఐ ఆశలు వదులుకోవాల్సిందేనా?

రాష్ట్ర వ్యాప్తంగా కమ్యూనిస్టులు(సీపీఐ, సీపీఎం) కాంగ్రెస్ పార్టీతో పొత్తులో సీట్లపై చర్చలు జరిగాయి. జిల్లా నుంచి బెల్లంపల్లి సీటు ఇవ్వాలని సీపీఐ నాయకత్వం కోరితే ఆ సీటును మాజీ మంత్రి గడ్డం వినోద్‌కు కేటాయించారు. చివరికి చెన్నూరు సీటు ఇస్తామనే ప్రతిపాదనలు వచ్చాయి. అక్కడ పోటీ చేసేందుకు తర్జనభర్జన పడిన కమ్యూనిస్టులు చివరికి సరే అన్నారు. నస్పూర్ పట్టణ కౌన్సిలర్ రేగుంట చంద్రశేఖర్‌ను తమ అభ్యర్థిగా బరిలో దింపేందుకు ప్రణాళిక వేశారు. కానీ వివేక్ ఎంట్రీతో మళ్లీ పరిస్థితులు అనూహ్యంగా మారాయి. ఈ క్రమంలో లెఫ్ట్ పార్టీకి ఇక్కడి సీటు ఇవ్వడం అనుమానంగానే భావిస్తున్నారు. పొత్తు ఖరారు కాకపోవడంతో కామ్రేడ్లు పోటీపై ఆశలు వదులుకోవాల్సి వస్తుందనే అభిప్రాయాలు వస్తున్నాయి. అయితే కాంగ్రెస్ పార్టీ తుది జాబితా వెలువడితే ఓ స్పష్టత రానుంది.

మాజీల పార్టీ మార్పులు?

వివేక్ రాకతో చెన్నూరు నుంచి పోటీ చేసేందుకు వచ్చిన ఆశావహులు తమ దారి తాము చూసుకుంటున్నారు. మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు బీజేపీ తీర్థం పుచ్చుకునేందుకు సిద్ధపడినట్లు సమాచారం. ఈ మేరకు బీజేపీ చేరికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్‌తో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలుస్తోంది. గతంలో వివేక్‌తో పొసగక బీజేపీని వీడి కాంగ్రెస్‌లో చేరిన మాజీ మంత్రి బోడ జనార్దన్ సైతం పార్టీని వీడుతారనే ప్రచారం జరుగుతోంది. అయితే వీరిద్దరి నుంచి ఎటువంటి అధికారిక ప్రకటన రాలేదు. ఇదే అదునుగా అసంతృప్త నాయకులను తమ వైపు తిప్పుకునేందుకు పార్టీలు ప్రయత్నం చేస్తున్నాయి.

ఆధారాలు చూపితే సరి



బాధితులు నగదు తిరిగి పొందేందుకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న గ్రీవెన్స్ సెల్ అధికారులు

- తనిఖీల్లో సీజ్ చేసిన నగదు బాధితులకు అప్పగింత
- గ్రీవెన్స్ సెల్ విచారణలో ధ్రువీకరణ పత్రాలు అందజేత
- రూ.10లక్షలు దాటితే ఐటీ ధ్రువీకరణ పత్రం ఉండాల్సిందే..
- ఇప్పటివరకు రూ.1.48 కోట్లు నగదు పట్టివేత

మంచిర్యాలఅగ్రికల్చర్: అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదలతో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లోకి వచ్చింది. ఓటర్లను ప్రలోభాలకు గురి చేసే వస్తువులేవీ తరలించకుండా భద్రత కట్టుదిట్టమైంది. ఫలితంగా సామాన్య ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఎన్నికల్లో అవినీతి కార్యకలాపాలను అరికట్టడానికి ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ 10, స్టాటిస్టికల్ సర్వేలైన్స్ 10 బృందాలు, పోలీసు సిబ్బంది తనిఖీల్లో ఆధారాలు చూపని వారి డబ్బు సీజ్ చేస్తున్నారు. జిల్లాలో అక్టోబర్ 9 నుంచి 30 వరకు రూ.50వేల పైబడి తరలిస్తున్న నగదు రూ.1,48,17,350 పట్టుకున్నారు. దీంతోపాటు రూ.లక్ష విలువైన బంగారం, వస్తువులు, మద్యం, మత్తు పదార్థాలు, చీరలు పట్టుకున్నారు. రూ.50వేల నుంచి రూ.10లక్షల కన్న తక్కువ నగదు, ఎన్నికలకు సంబంధించి వస్తువులు పట్టుబడితే జిల్లా ఎన్నికల కార్యాలయం(కలెక్టరేట్)లోని గ్రీవెన్స్ కమిటీకి అప్పగిస్తున్నారు. సరైన ధ్రువీకరణ పత్రాలు చూపిస్తే అధికారులు విచారణ జరిపి తిరిగి అందజేస్తున్నారు. రూ.10లక్షలకు పైగా పట్టుకున్న నగదుకు సంబంధించి ఐటీ అధికారుల ధ్రువీకరణ పత్రం ఉంటేనే ఇస్తున్నారు.

22 రోజుల్లో 73 కేసులు..

ఎన్నికల కోడ్‌పై సరైన అవగాహన లేక కొందరు సామాన్యులు అత్యవసర సమయంలో రూ.50వేలకు పైబడి నగదు తీసుకెళ్తుండగా పట్టుబడుతోంది. దీన్ని విడిపించుకునేందుకు బాధితులు అధికారుల చుట్టూ తిరగాల్సి వస్తోంది. ఇందు కోసం ప్రత్యేకంగా గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేశారు. జిల్లాలో గత 22 రోజుల వ్యవధిలో 73 కేసులు నమోదయ్యాయి. మరో రెండు 760 చీరలు పట్టుకున్న కేసులు ఉన్నాయి. ఇప్పటివరకు 69 కేసుల్లో నగదుకు సంబంధించి ధ్రువీకరణ పత్రాలు అందజేయడంతో బాధితులకు అందజేశారు. చీరలకు సంబంధించి రెండు కేసులు విడుదల చేయలేదు.

నెల రోజులు..

ఈ నెల రోజులూ ఎన్నికల కోడ్ అమల్లో ఉండనుంది. దీపావళి, పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలు, వ్యాపారులు, రైతుల నగదు లావాదేవీలు పెద్దయెత్తున నిర్వహించే సమయం.

త్రీమెన్ కమిటీ ఏర్పాటు..

తనిఖీ బృందాలు ఫ్లయింగ్‌స్క్వాడ్, స్టాటిక్ సర్వేలైన్స్, పోలీసు సిబ్బంది జిల్లా సరిహద్దు చెక్‌పోస్టుల తోపాటు ప్రధాన కూడళ్ల వద్ద ఆకస్మిక తనిఖీలు ముమ్మరంగా చేపడుతున్నారు. పట్టుకున్న నగదును జిల్లా ట్రెజరీ కార్యాలయానికి పంపిస్తున్నారు. బాధితుల కోసం గ్రీవెన్స్ సెల్ త్రీమెన్ కమిటీ ఏర్పాటు చేశారు. కమిటీ కన్వీనర్(ఎన్నికల ఖర్చుల మానిటరింగ్ విభాగం)గా నోడల్ అధికారి జి.హన్మంతరెడ్డి, సభ్యులుగా కే.నరేందర్(జెడ్పీ సీఈవో), జే.రాజేశ్వర్(జిల్లా ఖజానా శాఖ అధికారి)లను నియమించారు. నగదుకు సంబంధించి సరైన ధ్రువీకరణ పత్రాలు ఉన్నాయా లేదా పరిశీలించి నమ్మశక్యమైతే ధ్రువీకరణ పత్రం అందజేస్తారు. ఈ పత్రం అందజేస్తే ట్రెజరీలో తిరిగి నగదు అందజేస్తున్నారు.

ధ్రువీకరణ పత్రాలు అందజేయాలి

ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం రూ.50 వేలకు మించి నగదు వెంట తీసుకెళ్లొద్దు. ఏదైనా అత్యవసరం, వ్యాపార లావాదేవీలకు తీసుకెళ్తున్న నగదు పట్టుబడితే సరైన ధ్రువీకరణ పత్రాలు అందజేస్తే 48 గంటల్లో తిరిగి బాధితులకు అందజేస్తున్నాం. రూ.10 లక్షలకు పైగా ఉంటే ఐటీ అధికారుల నుంచి ధ్రువీకరణ పత్రాలు తీసుకు రావాలి. వివరాల కోసం 9441160708 నంబరులో సంప్రదించవచ్చు.

– జి.హన్మంతరెడ్డి, గ్రీవెన్స్ సెల్ కన్వీనర్

సామాన్యులకే తిప్పలు..

ఎన్నికలకు సంబంధించి ఏమో గానీ సామాన్యులకు సంబంధించిన నగదే ఇప్పటివరకు పట్టుబడింది. ఆస్పత్రికి వెళ్తున్న బాధితులు, కూతురు పెళ్లి కోసం కూడబెట్టిన నగదు బ్యాంకు నుంచి విత్‌డ్రా చేసి తీసుకెళ్తుండగా, మేకలు, ఎడ్లు అమ్ముకుని వస్తున్న వ్యాపారులు, దసరా పండుగ, శుభకార్యాల కోసం బట్టలు, బంగారం విక్రయించి ఇంటికి తెస్తున్న నగదు పట్టుకున్న సంఘటనలు ఉన్నాయి. చిరువ్యాపారులు, హోల్‌సేల్ వ్యాపారులు రోజువారీ కలెక్షన్ బ్యాంకులో జమ చేసేందుకు వెళ్తుండగా పట్టుకుని సీజ్ చేశారు. దీంతో బాధితులు ఆర్‌వో, కలెక్టరేట్, పోలీసు అధికారుల చుట్టూ తిరగాల్సి వస్తోంది.

- ఓ ఉపాధ్యాయురాలు తన బంధువుల దహన సంస్కారాలకు హాజరు కావడానికి కుమురంభీం జిల్లా నుంచి మంచిర్యాల జిల్లాకు కారులో వస్తూ తన మెడలోని నగలు కారులో దాచింది. ఇంట్లో దొంగల భయమని, చావు వద్దకు మెడలో బంగారు ఆభరణాలతో వెళ్తే బాగుండదని బ్యాగులో ఉంచి కారులో దాచుకుంది. బెల్లంపల్లి నియోజకవర్గ పరిధిలోని రేపల్లెవాడ సమీపంలో చెక్‌పోస్టు వద్ద పోలీసులు తనిఖీ చేసి సీజ్ చేశారు. బాధితురాలు లబోదిబోమంటూ అధికారుల వద్ద కంటతడి పెట్టింది. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో తిరిగి అందజేశారు. తనిఖీ బృందానికి చీవాట్లు తప్పలేదు.
- మరో బాధితుడు కరీంనగర్ ఆస్పత్రిలో తన బంధువు మృతదేహాన్ని తీసుకు రావడానికి రూ.55వేలు తీసుకెళ్తుండగా పట్టుకుని సీజ్ చేశారు. ఉన్నతాధికారులను ఆశ్రయించడంతో రెండ్రోజుల తర్వాత చెల్లించారు. మృతదేహాన్ని మార్చురీలో ఉంచినందుకు రూ.10వేల చొప్పున చెల్లించాల్సి వచ్చింది.
- బ్యాంకు నుంచి మరో బ్యాంకు తరలిస్తున్న యూనియన్ బ్యాంకు నగదు రూ.35లక్షలు పట్టుకున్నారు. బ్యాంకు అధికారులు ఐటీ ధ్రువీకరణ పత్రాలు అందజేయడంతో 48గంటల్లో అందజేశారు.

రేపటి నుంచి నామినేషన్ల స్వీకరణ



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బి.సంతోష్, పక్కన డీసీపీ సుధీర్, అధికారులు

- మధ్యాహ్నం మూడు గంటల్లోపే సమర్పించాలి
- ఐదుగురికి మించి రాకూడదు
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బి.సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 3 నుంచి నామినేషన్లు స్వీకరిస్తామని, ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల్లోపే సమర్పించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బి.సంతోష్ తెలిపారు. బుధవారం నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో డీసీపీ సుధీర్‌రాంనాథ్ కేకన్, జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్, మంచిర్యాల రిటర్నింగ్ అధికారి రాములుతో కలిసి రాజకీయ పార్టీల ప్రతినిధులు, మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి సంతోష్ మాట్లాడుతూ జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో 741 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, ప్రతీ పోలింగ్ కేంద్రంలో 1500మంది ఓటర్లకు మించకుండా చర్యలు తీసుకున్నామని అన్నారు. 3న నోటిఫికేషన్ విడుదల, 10వరకు నామినేషన్ల సమర్పణకు చివరి తేదీ, 13న పరిశీలన, 15న నామినేషన్ల ఉపసంహరణ, 30న పోలింగ్, డిసెంబర్ 3న లెక్కింపు ఉంటాయని వివరించారు. బెల్లంపల్లి, చెన్నూర్ తహసీల్దార్ కార్యాలయాల్లో, మంచిర్యాల ఆర్డీవో కార్యాలయంలో అభ్యర్థులు నామినేషన్లు సమర్పించాలని తెలిపారు. ఆన్‌లైన్‌లో సువిధ యాప్ ద్వారా నామినేషనన్ల సమర్పణకు అవకాశం కల్పించినట్లు చెప్పారు. అభ్యర్థుల తోపాటు ఐదుగురు, మూడు వాహనాలకు మించి రాకూడదని, ఒక్కో అభ్యర్థి నాలుగు సెట్ల నామినేషన్లు దాఖలు చేయవచ్చని, అత్యధికంగా రెండు చోట్ల పోటీ చేయవచ్చని తెలిపారు.

బ్యాంక్ ఖాతా తెరువాలి

అభ్యర్థులు ఎన్నికల ఖర్చు నిర్వహణ కోసం నామినేషన్ల దాఖలుకు ముందుగానే ప్రత్యేక బ్యాంకు ఖాతా తెరవాలని, వివరాలు నామినేషన్‌లో నమోదు చేయాలని ఎన్నికల అధికారి సంతోష్ తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రకారం రూ.40లక్షల వరకు ఖర్చు చేయవచ్చని అన్నారు. సభలు, సమావేశాలు, సామగ్రి, ప్రచారం, కరపత్రాలు తదితర వాటి ధరలు నిర్ణయించినట్లు తెలిపారు.

ఎన్నికల నిర్వహణ పర్యవేక్షించాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: ఎన్నికల రిటర్నింగ్ అధికారులు ఎన్నికల నిర్వహణ ప్రక్రియను పర్యవేక్షించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బి.సంతోష్ అన్నారు. బుధవారం మంచిర్యాల రిటర్నింగ్, ఆర్డీవో కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు, రిజిష్టర్లు పరిశీలించారు. మంచిర్యాల రిటర్నింగ్ అధికారి రాములు, అధికారులు పాల్గొన్నారు.

చెక్‌పోస్ట్‌లో పకడ్బందీగా తనిఖీలు నిర్వహించాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సంతోష్
- ఓట్ల లెక్కింపు కేంద్రం సందర్శన



లెక్కింపు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సంతోష్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఏర్పాటు చేసిన ప్రతీ చెక్‌పోస్ట్ వద్ద అధికారులు పకడ్బందీగా తనిఖీలు నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. బుధవారం హాజీపూర్ మండలం గుడిపేటలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాల తనిఖీ ప్రక్రియను వీడియో చిత్రీకరణ చేయాలని అన్నారు. అనంతరం ముల్కల్ల ఐజా కళాశాలలో ఏర్పాటు చేసిన ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని సందర్శించారు. అక్కడక్కడ కొన్ని మరమ్మతులపై సూచనలు చేశారు. ఓట్ల లెక్కింపు రోజున ఇబ్బందులు లేకుండా చేపట్టే సౌకర్యాలపై ఆరా తీశారు. లెక్కింపు విధులకు హాజరయ్యే అధికారులు, సిబ్బందికి వసతులు, సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. మంచిర్యాల నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ రాములు, హాజీపూర్ ఎస్సై నరేశ్‌కుమార్, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

- సోషల్ మీడియాపై ప్రత్యేక దృష్టి
- రామగుండం సీపీ రెమా రాజేశ్వరి



మాట్లాడుతున్న సీపీ రెమా రాజేశ్వరి

మంచిర్యాలక్రైం: ఈ నెల 30న ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు మీడియా సహకరించాలని రామగుండం సీపీ రెమా రాజేశ్వరి అన్నారు. రామగుండం పోలీసు కమిషనరేట్‌లో బుధవారం మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల పోలీసు అధికారులు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా సీపీ రెమా రాజేశ్వరి మాట్లాడుతూ కమిషనరేట్ పరిధిలో తొమ్మిది నియోజకవర్గాలు ఉన్నాయని, మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి, ఖానాపూర్ నియోజకవర్గం జన్నారం మండలంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నామినేషన్ కేంద్రాల వద్ద వంద మీటర్ల దూరం వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని అన్నారు. సువిధ యాప్ ద్వారా 402 అప్లికేషన్లు రాగా పరిశీలించామని, 38 తిరస్కరించామని, నాలుగు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత కమిషనరేట్ పరిధిలో రూ.3,45,35,406 నగదు, రూ.28,95,071 విలువైన 78గ్రాముల బంగారం, వెండి స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఫేక్ న్యూస్, సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా ఉంచామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు సుధీర్ రాంనాథ్ కేకన్, చేతన, ఏసీపీలు తిరుపతిరెడ్డి, మోహన్, సదయ్య, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

పోటెత్తిన ఓటరు నమోదు దరఖాస్తులు

- నెలరోజుల వ్యవధిలో 29,032
- చివరి రోజు యాప్‌కు వెల్లువ

మంచిర్యాలఅగ్రికల్చర్: నూతన ఓటరు నమోదుకు జిల్లాలో దరఖాస్తులు పోటెత్తాయి. ఆన్‌లైన్ ద్వారా ఎన్నికల సంఘం ఇచ్చిన గడువు అక్టోబర్ 31తో ముగిసింది. నెల రోజుల వ్యవధిలో 29,032 దరఖాస్తులు వచ్చాయి. చివరి రోజు ఒకేసారి పెద్ద ఎత్తున ఆన్‌లైన్ దరఖాస్తులు అప్‌లోడ్ చేయడంతో సర్వర్ సమస్యతో దరఖాస్తుదారులు కొంత ఇబ్బంది పడ్డారు. మీ సేవ కేంద్రాల వద్ద రాత్రి వరకు వేచి ఉండి ఓటరుగా నమోదు చేసుకున్నారు. 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని కళాశాలలు, గ్రామాల్లో పెద్ద ఎత్తున ప్రచారం కల్పించడంతో యువత బారులు తీరారు. నవంబర్ 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగానికి అవకాశం కల్పించారు. తక్కువ ఓటరు నమోదైన గ్రామాలు, కాలనీల్లో కళాబృందాలతో అధికారులు ప్రచారం చేశారు. క్షేత్రస్థాయిలో బీఎల్‌వో ప్రతీ ఇంటికి వెళ్లి ఓటు నమోదుకు ప్రచారం చేపట్టారు. గత నెలలో జిల్లాలోని ఓటరు తుది జాబితా 4న విడుదల చేయగా జిల్లాలో మొత్తం 6,18,528 మంది ఓటర్లు ఉన్నారు. కొత్తగా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హులైన వారికి అవకాశం కల్పిస్తూ ఈ నెల 10న తుది ఓటరు జాబితా విడుదల చేయనున్నారు. చెన్నూర్ నియోజకవర్గం నుంచి 6,978, బెల్లంపల్లిలో 6,350, మంచిర్యాలలో 15,704 దరఖాస్తులు వచ్చాయి. ఇప్పటివరకు 15,866 మందిని అర్హులుగా గుర్తించారు. 562 దరఖాస్తులను తిరస్కరించారు. మిగతా దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయి. పుట్టినతేదీ, చదువు, నివాస, తదితర ధ్రువీకరణ పత్రాలు సరైనవి ఉన్నవాటికి మాత్రమే ఓటరు జాబితాలో చోటు కల్పిస్తున్నారు.

వివేక్ కాంగ్రెస్‌లో చేరినా.. బీజేపీని వీడినా సంబరమే !

- కాంగ్రెస్ నాయకుల హర్షం
- బీజేపీ నాయకుల ఆనందం



జైపూర్‌లో టపాసులు కాల్చి కాంగ్రెస్ సంబరాలు



బెల్లంపల్లి: సంబరాల్లో బీజేపీ శ్రేణులు

జైపూర్: మాజీ ఎంపీ వివేక్ కాంగ్రెస్ పార్టీలో చేరికతో ఆ పార్టీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. అటు బీజేపీ నాయకులు కూడా వివేక్ పార్టీని వీడినందుకు సంబరాలు చేసుకోవడం గమనార్హం. జైపూర్ మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి రిక్కుల శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం వివేక్ పార్టీలో చేరికతో బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. వైఎస్సార్ టీపీ జైపూర్ మండల అధ్యక్షుడు తుంగపిండి సాయికుమార్ కాంగ్రెస్ పార్టీలో చేరగా శ్రీనివాస్‌రెడ్డి పార్టీలోకి ఆహ్వానించారు.

కాసిపేటలో..

కాసిపేట: వివేక్ చేరికను స్వాగతిస్తూ కాసిపేట మండల కేంద్రంలో బుధవారం టపాకాయలు పేల్చి మిఠాయిలు పంచుకుని సంబరాలు చేసుకున్నారు. కాంగ్రెస్ నాయకులు రత్నం ప్రదీప్, మైదం రమేష్, గోలేటి స్వామి, గుండ రాజ్‌కుమార్, జాడి శివ తదితరులు పాల్గొన్నారు.

చెన్నూర్‌లో..

చెన్నూర్: చెన్నూర్‌లోని తెలంగాణ తల్లి, పాతబస్టాండ్ అంబేద్కర్ చౌరస్తా వద్ద బుధవారం కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. బాణాసంచా కాల్చి మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బషీరొద్దీన్, చెన్నూరి శ్రీధర్, కృష్ణగౌడ్, మహేశ్ పాల్గొన్నారు.

కొబ్బరికాయలు కొట్టిన బీజేపీ శ్రేణులు

బెల్లంపల్లి: వివేక్ బీజేపీకి రాజీనామా చేయడంతో ఆ పార్టీ నాయకులు బుధవారం బెల్లంపల్లి పట్టణంలోని కాంటా చౌరస్తా వద్ద బాణాసంచా కాల్చి, కొబ్బరికాయలు కొట్టారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కొయ్యల ఏమాజీ మాట్లాడుతూ గత 12 ఏళ్ల కాలంలో వివేక్ ఆరుసార్లు పార్టీ మారారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. 'బీజేపీ ద్రోహి.. వెన్నుపోటుదారుడు వివేక్ వెంకటస్వామి' అంటూ ఫ్లెక్సీని ప్రదర్శించారు. బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కేశవరెడ్డి, జిల్లా కార్యదర్శి కె.గోవర్ధన్, నాయకులు అజ్మీరా శ్రీనివాస్, దూది ప్రకాష్, నర్సింగ్, శ్రావణ్, సోమన్న పాల్గొన్నారు.

క్లుప్తంగా

'గునిగంటి'కి సన్మానం



నర్సింగరావును సన్మానిస్తున్న నాయకులు

శ్రీరాంపూర్: సింగరేణి కాలరీస్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ శ్రీరాంపూర్ ఏరియా చీఫ్ అడ్వైజర్ గునిగంటి నర్సింగరావును బుధవారం ఏఐటీయూసీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఇటీవలే ఎన్నికైన ఆయనను సీసీసీ కార్నర్‌లోని నరసయ్య భవన్‌లో శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఆ యూనియన్ డెప్యూటీ ప్రధాన కార్యదర్శులు కే.వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, కాంట్రాక్టు కార్మికుల సంఘం రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, నాయకులు మోతే లచ్చన్న, దొడ్డిపట్ల రవీందర్, శ్రీకాంత్, యాదగిరి, శ్రావణ్, తదితరులు పాల్గొన్నారు.

మహిళపై కేసు

నెన్నెల: మండలంలోని పెద్ద లంబాడితండాకు చెందిన జాటోత్ సరితపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్యాంపటేల్ తెలిపారు. ఇంటి వెనుక పెరట్లో గుడుంబా తయారు చేస్తుండగా దాడి చేసి పట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. 35 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని వంద లీటర్ల బెల్లం పానకం పారబోసినట్లు తెలిపారు.

నగదు పట్టివేత



పట్టుబడిన నగదుతో సీఐ శ్రీనివాస్

వాంకిడి: మండలంలోని టోల్ ప్లాజా వద్ద సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన వాహనాల తనిఖీల్లో రూ.5.50 లక్షల నగదు పట్టుబడినట్లు ఎస్సై సాగర్ తెలిపారు. మహారాష్ట్రకు చెందిన సయ్యద్ సోయబ్ కారులో ఎలాంటి ఆధారాలు లేకుండా రూ.5.50 లక్షలు తరలిస్తుండగా పట్టుబడినట్లు ఎస్సై పేర్కొన్నారు. నగదు స్వాధీనం చేసుకుని ఎఫ్ఎస్‌టీ టీమ్‌కు అప్పగించినట్లు తెలిపారు. తనిఖీల్లో ఏఎస్సై పోశెట్టి, సిబ్బంది పాల్గొన్నారు.

సిర్పూర్(టి): మండలంలోని హుడ్కిలి అంతర్రాష్ట్ర రహదారిలో ఉన్న చెక్‌పోస్టు వద్ద బుధవారం రూ.2 లక్షల 46 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై డీకొండ రమేశ్ తెలిపారు. పోలీసులు, ఎంపీడీవో కార్యాలయ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో కాగజ్‌నగర్ మండలం ఆరెగూడ గ్రామానికి చెందిన వ్యక్తితో పాటు డబ్బా గ్రామం, చింతలమానెపల్లి మండలానికి చెందిన వ్యక్తులు నగదు తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మద్యం పట్టివేత



పట్టుకున్న మద్యం బాటిళ్లు

బెల్లంపల్లి: అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టుకున్నట్లు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో బన్సీలాల్ తెలిపారు. కాంటా చౌరస్తా వద్ద బుధవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా నంబర్ 2 ఇంక్లైన్ బస్తీకి చెందిన తైదల లక్ష్మి మద్యం తీసుకెళ్తూ పట్టుబడింది. ఆమె వద్ద యునైటెడ్ గోల్డ్ 180 ఎంఎల్ బాటిళ్లు 10, ఆఫీసర్స్ చాయిస్ 90 ఎంఎల్ బాటిళ్లు 27 లభించాయని, వాటి విలువ రూ.3,260 ఉంటుందన్నారు. మద్యం స్వాధీనం చేసుకుని నిందితురాలిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

తస్మాత్ జాగ్రత్త..

జంగ్ తెలంగాణ

- రేపటి నుంచి నామినేషన్ల స్వీకరణ
- అభ్యర్థులు ఆస్తులు, నేర చరిత్ర చెప్పాల్సిందే
- పొరపాటు చేస్తే పదవికే ఎసరు

బెల్లంపల్లి/కై లాస్‌నగర్: అసెంబ్లీ ఎన్నికల్లో తొలి అంకమైన నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ రేపటి నుంచి ప్రారంభం కానుంది. పోటీ చేస్తున్న అభ్యర్థులు ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది. నామినేషన్ పత్రాన్ని సరిగా పూర్తిచేసి ఎన్నికల రిటర్నింగ్ అధికారి (ఆర్‌ఓ)కు అప్పగించడం, విధి విధానాలను అనుసరించి వ్యవహరించడం, పలు అంశాలను తూచ తప్పకుండా పాటించాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా ఎన్నికల అఫిడవిట్‌లో తమ ఆస్తులు, నేర చరిత్ర, కులం వంటి వివరాలను పక్కాగా నమోదు చేయాలి. ఇందులో ఏమాత్రం పొరపాటు జరిగినా వారి నామినేషన్ తిరస్కరణకు గురయ్యే అవకాశం ఉంది. అఫిడవిట్‌లో వివరాలు తప్పుగా నమోదు చేసి ఎన్నికల్లో విజయం సాధించినా ప్రత్యర్థులు కోర్టును ఆశ్రయిస్తే పదవిని కోల్పోయే ప్రమాదం ఉంది. అందుచేత నామినేషన్ పత్రాల్లో సరైన వివరాలు జాగ్రత్తగా నమోదు చేయాలని, నామినేషన్ వేసే సమయంలో అభ్యర్థులు ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఎన్నికల అధికారులు సూచిస్తున్నారు.



బెల్లంపల్లి ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయం

ఆస్తుల వివరాలు అందించాల్సిందే...

ఎన్నికల్లో పోటీ చేసే ఎమ్మెల్యే అభ్యర్థులు నామినేషన్ పత్రాల్లో తమకున్న ఆస్తుల వివరాలను విధిగా నమోదు చేయాలి. స్థిర, చర ఆస్తులతో పాటు ఆభరణాలు, వాహనాల వివరాలను నిర్దిష్ట ప్రోఫార్మాలో నమోదు చేయాలి. వారికున్న రుణాలు, అప్పులు, ఈ ఐదేళ్లలో జరిగిన ఆర్థిక లావాదేవీల వివరాలు అందించాలి.

కులం వివరాలు తప్పనిసరి

రిజర్వుడ్ నియోజకవర్గాల్లో పోటీ చేసే అభ్యర్థులు తప్పనిసరిగా తమ కులం వివరాలను అఫిడవిట్‌లో నమోదు చేయాలి. ఈసీ ప్రకటించిన రిజర్వేషన్ ప్రకారంగానే అభ్యర్థులు పోటీ చేయాల్సి ఉండడంతో ఆ కులం వివరాలతో పాటు రెవెన్యూ అధికారి జారీ చేసిన పత్రం జత చేయాలి. జనరల్ స్థానాల్లో పోటీ చేసే వారికి ఈ నిబంధన వర్తించదు.

నామినేషన్ దాఖలు కోసం..

- ఓటు హక్కు కలిగి ఉన్న ప్రతీ పౌరుడు ఎన్నికల్లో పోటీ చేయవచ్చు.
- పోటీచేసే అభ్యర్థి అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి (ఆర్‌వో) కార్యాలయం నుంచి నామినేషన్‌పత్రం పొందాల్సి ఉంటుంది.
- నామినేషన్ పత్రాన్ని అభ్యర్థి క్షుణ్ణంగా చదివి అన్ని వివరాలు సంపూర్ణంగా నింపాలి.
- నామినేషన్ దాఖలు చేయడం కోసం ఎన్నికల రిటర్నింగ్ అధికారి వద్దకు అభ్యర్థితో పాటు మరో నలుగురిని మాత్రమే అనుమతిస్తారు.
- నామినేషన్ దాఖలు చేయడానికి ఆర్‌వో కార్యాలయం వరకు వెళ్లడానికి అభ్యర్థికి సంబంధించి 3 వాహనాలను మాత్రమే అనుమతిస్తారు. వాటిలో అభ్యర్థితో సహా మరో నలుగురు మాత్రమే వెంట ఉండాల్సి ఉంటుంది. అంతకుమించి ఏ ఒక్కరినీ అదనంగా పంపించడానికి అనుమతించడం కుదరదు.
- నామినేషన్ దాఖలు చేసే సమయంలో అభ్యర్థి, అతని పార్టీ లేదా అనుచరులు వినియోగించే వాహనాలు ఆర్‌వో కార్యాలయానికి 100 మీటర్ల దూరంలో పార్కింగ్ చేయాలి.
- నామినేషన్ దాఖలు చేసే క్రమంలో రిటర్నింగ్ అధికారి కార్యాలయం పరిసరాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుంది. అభ్యర్థులు ఆ విషయాన్ని గుర్తుంచుకోవాలి.
- పూర్తి చేసిన నామినేషన్ పత్రాన్ని ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల లోపు ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అందించాలి.
- ప్రభుత్వం ప్రకటించిన సెలవు దినాల్లో నామినేషన్ల స్వీకరణ జరగదు.
- ఒక అభ్యర్థి గరిష్ఠంగా 4 సెట్ల వరకు నామినేషన్ పత్రాలను దాఖలు చేయవచ్చు.
- ఏదేని గుర్తింపు పొందిన రాజకీయపార్టీ నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థి అయితే ఆ నియోజకవర్గ పౌరుడు ప్రతిపాదించి సంతకం చేస్తే సరిపోతుంది.
- ఇండిపెండెంట్ అభ్యర్థి అయితే 10 మంది పౌరులు ప్రతిపాదించి సంతకం చేయాల్సి ఉంటుంది.
- ప్రతిపాదించే పౌరుడు నిరక్షరాస్యుడైతే సదరు వ్యక్తి రిటర్నింగ్ అధికారి ముందు వేలిముద్ర వేయాల్సి ఉంటుంది.
- నామినేషన్ దాఖలు చేస్తున్న అభ్యర్థి రిజర్వేషన్ ప్రాతిపదికన ఎస్సీ, ఎస్టీ అయితే రూ.5 వేలు, బీసీ, జనరల్ అభ్యర్థులైతే రూ.10 వేలు చొప్పున డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. నగదు లేదా ట్రెజరరీ చలానా ద్వారా డిపాజిట్ చేయవచ్చు.
- అభ్యర్థి గరిష్ఠంగా రెండు అసెంబ్లీ నియోజకవర్గాలకు మించి ఎన్నికల్లో పోటీ చేయడానికి వీలు లేదు.

బ్యాంకు ఖాతా తప్పనిసరి

- ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థి తప్పనిసరిగా నామినేషన్ దాఖలుకు కనీసం ఒక రోజు ముందు ప్రభుత్వ రంగ బ్యాంకు నుంచి కొత్తగా ఖాతా తెరిచి ఉంచుకోవాలి.
- అభ్యర్థి నాన్ లోకల్ అయితే అతనికి ఎక్కడ ఓటు హక్కు ఉందో ఆ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి సదరు అభ్యర్థికి ఓటు ఉన్నట్లు ధృవీకరించి అటెస్టెడ్ చేయాల్సి ఉంటుంది.
- నాన్ లోకల్ అభ్యర్థిని ప్రతిపాదించే పౌరుడు మాత్రం పోటీ చేస్తున్న నియోజకవర్గానికి చెందిన వాడై ఉండాలి.
- అభ్యర్థి నామినేషన్ పత్రంతో పాటు 10 పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు అందజేయాలి. నల్లద్దాలు, కూలింగ్ అద్దాలు ధరించి దిగిన ఫొటోలు చెల్లుబాటు కావు.
- ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థి నామినేషన్‌పత్రంతో పాటు ఫామ్ 26 రిటర్నింగ్ అధికారికి అందజేయాలి. నామినేషన్ దాఖలు చేసే రోజు ఫామ్ 26ను అందజేయకపోయినా ఆఖరు రోజు (10న) మధ్యాహ్నం 3 గంటలలోపు తప్పనిసరిగా అందజేయాల్సి ఉంటుంది.
- అభ్యర్థిపై ఏదైనా పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్, ఇతర కేసులు నమోదై ఉంటే వాటి వివరాలను తప్పనిసరిగా దినపత్రికల్లో ప్రముఖంగా ప్రకటించాలి.
- గుర్తింపు పొందిన రాజకీయపార్టీ తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థి నామినేషన్ దాఖలు చివరి రోజు వరకు ఏ, బీ ఫామ్స్ అందించడం అనివార్యం.
- పోటీ చేస్తున్న అభ్యర్థి ఎలక్షన్ ఏజెంట్, అడిషనల్ ఎలక్షన్ ఏజెంట్‌ను నియమించుకోవచ్చు.

తప్పుడు సమాచారంతో ఇబ్బందులే

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఈసీ నిబంధనల మేరకు నామినేషన్ పత్రాల అఫిడవిట్‌లో ఆస్తులు, కేసుల వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలి. ఈ వివరాలను ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో ప్రజల ముందు ఉంచుతుంది. కనుక తప్పుడు సమాచారం నమోదు చేస్తే భవిష్యత్‌లో న్యాయపరంగా ఇబ్బంది పడాల్సి ఉంటుంది. ఎన్నికల అఫిడవిట్‌ను పూర్తిగా నమోదు చేయాలి. లేనిపక్షంలో తిరస్కరణకు గురయ్యే అవకాశం ఉంది. అభ్యర్థులు జాగ్రత్తగా వ్యవహరించడం శ్రేయస్కరం.

– ఎస్.శ్రీనివాస్, ఏఈఆర్‌వో, ఆదిలాబాద్

అయ్యో... ఆ ఫొటోలన్నీ తీసెయ్యాలె!

- నాయకులు మారితే పాత ఫొటోలు చెత్తబుట్టల్లోకే..

అసెంబ్లీ ఎన్నికల్లో మారుతున్న సమీకరణాలతో నాయకులు తమకు నచ్చిన పార్టీలో చేరుతున్నారు. నాయకుల మనస్సు మారినంత ఈజీగా ప్రచార సామగ్రిని కూడా మార్చాల్సి వస్తోంది. రూ.లక్షలు ఖర్చు చేసి ప్రకటనలు, కరపత్రాలు, డిజిటల్ తెరలు, ప్రచార రథాలు, ఆఫీసులు, ఫ్లెక్సీల్లో నాయకుల ఫొటోలు ప్రముఖంగా ముద్రించి ఉంటాయి. నాయకులెవరైనా పార్టీ మారాగానే అవి వృథాగా మారుతున్నాయి. తాజాగా పెద్దపల్లి లోక్‌సభ నియోజకవర్గ పరిధి మాజీ ఎంపీ పార్టీ మారదంతో ఇప్పటి దాకా ఆయన ఫొటోలతో ఉన్నవన్నీ తొలగిస్తున్నారు. పార్టీ మారినట్లు తెలియగానే స్థానిక అసెంబ్లీ స్థానాల్లో ఆయన పేరు, ఫొటోలన్నింటిని కనిపించకుండా చేస్తున్నారు. మంచిర్యాల జిల్లాలో రెండు రోజుల క్రితమే ఆ నాయకుడు ప్రముఖంగా ఉన్న ఫొటోలతో వేలాది కరపత్రాలు ముద్రించి నియోజకవర్గంలో పంచేందుకు తెచ్చారు. ఆయన పార్టీ మారడంతో రూ.లక్షలు ఖర్చు చేసిన అవి పనికి రాకుండా పోయాయి. ఇక బెల్లపల్లి పార్టీ ఆఫీసులో ఆయన ఫొటోలు ఉన్న ఫ్లెక్సీలను చించివేశారు. రాష్ట్రంలో ఎన్నికల వేళ రాజకీయ నాయకుల కండువాల మార్పులతో ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయి.

– సాక్షి ప్రతినిధి, మంచిర్యాల

పులి పిల్లలంటూ పుకార్లు..

భీమిని: కన్నెపల్లి మండలంలోని జన్కాపూర్ శివారులోకి రెండు పులి పిల్లలు వచ్చాయని పుకార్లు రావడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. మంగళవారం రాత్రి అటుగా వెళ్లిన యువకులు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. బుధవారం ఫారెస్ట్ అధికారులు వచ్చి పరిశీలించగా కాలిముద్రల ఆనవాళ్లు లభించలేదు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రజలు భయాందోళన చెందవద్దన్నారు. ఈ విషయమై ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ గోవిందసింగ్ సర్దార్‌ను వివరణ కోరగా పులి పిల్లలకు సంబంధించిన కాలి ముద్రలు లేవని కొట్టిపారేశారు.

ఓటు కోసం ఏడు కిలోమీటర్లు..

- ఊట్ల గిరిజనుల కష్టాలు

దండేపల్లి(మంచిర్యాల): ఓటు హక్కు వినియోగించుకోవాలంటే ఆ గ్రామ గిరిజనులు ఏడు కిలోమీటర్ల దూరం వెళ్లకతప్పడంలేదు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని అధికారులు, ప్రభుత్వం విస్తృత ప్రచారం, అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నా ఓటు హక్కు వినియోగానికి ప్రజలు పడే ఇబ్బందులు మాత్రం గుర్తించడంలేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం పాతమామిడిపల్లి పంచాయతీ పరిధిలోని దట్టమైన అటవీ ప్రాంతంలో ఊట్ల గిరిజన గ్రామం ఉంది. గ్రామంలో 22 కుటుంబాల్లో సుమారు 80 మందికి పైగా జనాభా 36 మంది ఓటర్లు ఉన్నారు. ఎన్నికల్లో ఓటు వేయడానికి తమ గ్రామానికి ఏడు కిలో మీటర్ల దూరంలో ఉన్న మామిడిపల్లికి వెళ్లాల్సి వస్తోంది. ఆ గ్రామానికి వెళ్లాలంటే రహదారి సౌకర్యం సరిగా లేక ఇబ్బంది పడుతున్నారు. రోడ్డుపై కంకరతేలి అధ్వానంగా ఉంది. మరమ్మతులు చేపట్టకపోవడంతో వారికి దారికష్టాలు తప్పడంలేదు. ఎన్నికల సమయంలో మాత్రం అభ్యర్థులు ఓటర్లకు వాహనాలు సమకూరుస్తారు. కానీ ఎన్నికల తర్వాత తమను ఎవరూ పట్టించుకోవడంలేదని గ్రామస్తులు వాపోతున్నారు. మండలంలోని మరికొన్ని గిరిజన గ్రామాలకు కూడా పోలింగ్ కేంద్రాలు, రెండు, మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి.



ఊట్ల ఓటర్లు

'సివిక్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి'

శ్రీరాంపూర్: డివిజన్‌లో పనిచేస్తున్న సివిక్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం కృష్ణాకాలనీలోని సివిక్ కార్యాలయం వద్ద కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20 ఏళ్లుగా సివిక్ విభాగంలో కాంట్రాక్ట్ కార్మికులు పనిచేస్తున్నారని, వీరికి కనీస సౌకర్యాలు కూడా లేవన్నారు. పనిస్థలాల్లో రెస్ట్ షెల్టర్లు లేవని, కనీసం బాత్రూమ్స్ కూడా లేకపోవడంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ డివిజన్ కార్యదర్శి అంకూస్, నాయకులు కిరణ్, ఈశ్వర్, బంగారమ్మ, మేరీ, హంస, రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న కాంట్రాక్ట్ కార్మికులు

టీహబ్‌లో పూర్తి సేవలు అందేదెప్పుడు....!

- ప్రారంభించి మూణ్నెళ్లయినా సేవలు అంతంతే
- వైద్యులు, ల్యాబ్ టెక్నీషియన్ల నియామకం లేదు

మంచిర్యాలటౌన్: తెలంగాణ డయాగ్నోస్టిక్స్ కేంద్రం (టీ–హబ్)ను ఈ ఏడాది జూలై 1న వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు వర్చువల్ ద్వారా ప్రారంభించారు. మూడునెలలు కావస్తున్నా వైద్యులు, ల్యాబ్ టెక్నీషియన్లు, సిబ్బందిని నియమించలేదు. దీంతో 134 రకాల వైద్య పరీక్షలను అందించాల్సిన ఈ కేంద్రం కేవలం కొన్ని రకాల వైద్య పరీక్షలకే పరిమితం అవుతోంది. ప్రస్తుతం జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. ప్రజలు జ్వరం, దగ్గు, జలుబు, ఒళ్లు నొప్పులతో బాధపడుతున్నారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. టీహబ్‌లో అన్నిరకాల వైద్యపరీక్షలు చేయాల్సి ఉన్నా పూర్తిస్థాయిలో చేయడంలేదు. సీజనల్ వ్యాధులకు సంబంధించిన శాంపిళ్లు, ఆరోగ్య మహిళ వైద్య పరీక్షలకు సంబంధించిన శాంపిళ్లు రోజుకు వందలాదిగా టీహబ్‌కు వస్తుండడంతో సిబ్బంది కొరతతో వాటిని పూర్తి చేయడం కష్టంగా మారుతోంది. ఎంతో అట్టహాసంగా టీహబ్‌ను ఏర్పాటు చేసి, జిల్లాలో పలు ఆసుపత్రుల్లో పనిచేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్లు, ఇతర సిబ్బందిని డెప్యూటేషన్‌పై టీహబ్‌కు కేటాయించారు. ఈ కేంద్రానికి పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమిస్తేనే ప్రజలకు 134 రకాల వైద్య పరీక్షలు అందించేందుకు అవకాశం ఉంటుంది.



జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన టీహబ్

సిబ్బందిని నియమిస్తేనే...

మంచిర్యాల టీహబ్‌లో తప్పనిసరిగా రేడియాలజీ, బయోకెమిస్టు వైద్యులు, 12 మంది ల్యాబ్ టెక్నీషియన్లు, ఈసీజీ, 2డీ ఈకో టెక్నీషియన్లు ఉండాలి. కానీ ప్రస్తుతం నలుగురు మాత్రమే ల్యాబ్ టెక్నీషియన్లు పనిచేస్తుండగా, రేడియాలజీ, బయోకెమిస్టు , కార్డియాలజిస్టు వైద్యులు, ఈసీజీ, 2డి ఈకో టెక్నీషియన్లు లేరు. రోజురోజుకు ఆరోగ్య మహిళతో పాటు, ఇతరత్ర టెస్టుల సంఖ్య పెరుగుతున్నా సిబ్బంది కొరతతో ముందుకు సాగడం లేదు. టీహబ్‌లో పరీక్షలకు అవసరమయ్యే అన్ని విభాగాలు ఏర్పాటు చేసి, అత్యాధునిక పరికరాలను ఏర్పాటు చేసినా నిరుపయోగంగా ఉన్నాయి. టీహబ్‌లో బయోకెమిస్ట్రీ విభాగంలో 56 రకాలు, పాథాలజీ విభాగంలో 37 రకాలు, మైక్రో బయాలజీలో 41 రకాల పరీక్షలు చేయాల్సి ఉంది. ఆయా విభాగాలకు అవసరమైన వైద్యులు, ఫార్మాసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్లు లేక పూర్తిస్థాయి పరీక్షలు చేయడం లేదు. ప్రస్తుతం జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ హెల్త్ సెంటర్లలో ల్యాబ్ టెక్నీషియన్లు ఉన్నా శాంపిళ్లు తీసుకుని టీహబ్‌కే పంపిస్తున్నారు. అందులో నుంచి కొందరిని టీహబ్‌కు డెప్యూటేషన్ మీద పంపిస్తే సేవలకు ఆటంకం కలగదనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

సిబ్బందిని నియమించాల్సి ఉంది



మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రి పరిధిలో నిర్వహిస్తున్న టీహబ్‌లో ల్యాబ్ టెక్నీషియన్ల కొరత ఎక్కువగా ఉంది. 12 మందికి కేవలం నలుగురు మాత్రమే పనిచేస్తున్నారు. రేడియాలజిస్టు, బయోకెమిస్టు వైద్యుల కోసం పలుమార్లు నోటిఫికేషన్ ఇస్తున్నా ఎవరూ రావడం లేదు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల నుంచి వచ్చిన శాంపిళ్లు టీహబ్‌కే పంపిస్తున్నారు. సరిపడా సిబ్బంది లేకపోయినా టీహబ్‌ను 24 గంటల పాటు నిర్వహిస్తున్నాం.

– డాక్టర్ హరీశ్‌చంద్రరెడ్డి, మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్

'బద్ధంపల్లి రూట్‌కు మినీబస్ పెట్టండి'



అటవీ ప్రాంతంలో శిథిలమైన కల్వర్టు

వేమనపల్లి(బెల్లంపల్లి): చామనపల్లి గ్రామ పంచాయతీకి వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం లేదని మండల అధికారులే బుధవారం అడిషనల్ కలెక్టర్ (రిటర్నింగ్ అధికారి) రాహుల్‌కు మొరపెట్టుకున్నారు. ఆ రూట్‌లో ఎన్నికల విధులకు అధికారులు, సామగ్రి వెళ్లాలంటే కష్టతరమని విన్నవించారు. చామనపల్లి జీపీ బద్ధంపల్లి రూట్‌లో ఎన్నికల విధులకు ప్రత్యేక రూట్ ఏర్పాటు చేసి మినీబస్, తూఫాన్ వ్యాన్ ఏర్పాటు చేయాలని కోరారు. బద్ధంపల్లి రూట్‌లో మట్టి రోడ్డు, మూడు అసంపూర్తి కల్వర్టులు ఉన్నాయి. కోటపల్లి మండలం మల్లంపేట నుంచి 12 కిలోమీటర్ల అటవీ మార్గం గుండా బద్ధంపల్లికి వెళ్లాల్సి ఉంటుంది. రోడ్డు సౌకర్యం లేకపోవడంతో పోలింగ్ సిబ్బందితో పాటు సామగ్రి తీసుకెళ్లే వాహనాలు కల్వర్టులు దాటి వెళ్లలేవు. దీనిని దృష్టిలో ఉంచుకుని బద్ధంపల్లి రూట్‌లో ప్రత్యేకంగా రూట్ ఆఫీసర్, మినీ బస్ సౌకర్యం ఏర్పాటు చేయాలని కోరారు.

నకిలీ మెసేజ్‌లు నమ్మొద్దు

మంచిర్యాలక్రైం: వాట్సాప్‌లలో నకిలీ మెసేజ్‌లు నమ్మి మోసపోవద్దని రామగుండం పోలీస్ కమిషనరేట్ సైబర్ క్రైమ్ ఏసీపీ డాక్టర్ రాజేశ్ అన్నారు. బుధవారం వివేక వర్ధిని డిగ్రీ కళాశాల విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సైబర్ క్రైమ్ సీఐ మహేందర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేర్వేరు కారణాలతో ఇద్దరు బలవన్మరణం



క్రాంతికుమార్ (ఫైల్)

నస్పూర్: పట్టణ పరిధిలో వేర్వేరు కారణాలతో ఇద్దరు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. సీసీసీ నస్పూర్ ఎస్సై రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.....పట్టణ పరిధిలోని రామ్‌నగర్‌లో నివాసం ఉంటున్న పాలకుర్తి క్రాంతికుమార్ (38) ఓ హోటల్‌లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండడంతో పనికి వెళ్లడం లేదు. దీంతో ఆర్థిక సమస్యలు ఎక్కువ కావడంతో మనోవేదనకు గురై మంగళవారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుని తండ్రి రవికుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

మనస్తాపంతో ఒకరు..

పట్టణ పరిధిలోని విలేజ్ శ్రీరాంపూర్‌లో నివాసం ఉంటున్న అసంపల్లి శంకర్ (48) వెల్డింగ్ షాప్‌లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఠాగూర్ నగర్‌కు చెందిన కుమార్ తన ఇంటి వద్ద ఉన్న ఇనుప పైపులను శంకర్ ఎత్తుకెళ్లాడని అనుమానించి దాడికి పాల్పడ్డాడు. దీంతో మనస్తాపం చెందిన శంకర్ బుధవారం శ్యామ్‌నగర్ గోదాముల సమీపంలో చెట్టుకు ఉరేసుకుని బలవన్మరణం చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుని కుమారుడు శ్రీ సాయికుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మారని ఆర్‌ఎంపీల తీరు!

- ఆందోళనకరంగా మరో మహిళ ఆరోగ్య పరిస్థితి

చింతలమానెపల్లి(సిర్పూర్): వైద్యం వికటించి వరుస మరణాలు సంభవిస్తున్నా కొందరి ఆర్‌ఎంపీల తీరు మారడం లేదు. అరకొర వైద్యం చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. తాజాగా చింతలమానెపల్లి మండలం కోర్సిని గ్రామానికి చెందిన నైతం లక్ష్మి అనే ఆదివాసీ మహిళకు గంగాపూర్ గ్రామానికి చెందిన ఓ ఆర్‌ఎంపీ చేసిన వైద్యంతో ఆరోగ్య పరిస్థితి విషమించింది. బాధిత కుటుంబం తెలిపిన వివరాల ప్రకారం.. నాలుగు రోజులుగా లక్ష్మి జ్వరంతో బాధపడుతోంది. గంగాపూర్‌కు చెందిన లోడెల్లి సాగర్ అనే ఆర్‌ఎంపీ ఆమెకు చికిత్స అందించాడు. సెలైన్ ఎక్కించి ఇంజక్షన్లు ఇవ్వగా పరిస్థితి విషమించింది. మహిళ చేతికి పెట్టిన ఐవీ కాన్యులా తొలగించి చికిత్స కోసం ఆసుపత్రికి తరలించాలని సదరు ఆర్‌ఎంపీ కుటుంబ సభ్యులకు తెలిపాడు. ఆందోళనకు గురైన వారు లక్ష్మిని ఆటోలో కౌటాలలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ తాత్కాలికంగా చికిత్స అందించిన డాక్టర్లు మెరుగైన వైద్యం కోసం కాగజ్‌నగర్‌కు తీసుకెళ్లాలని సూచించారు. మళ్లీ లక్ష్మిని అంబులెన్స్‌లో కాగజ్‌నగర్‌కు తరలించారు. నాలుగు రోజుల క్రితమే కోర్సినిలో ధన్నూరి పుష్పలత అనే మహిళ ఆర్‌ఎంపీ వైద్యం వికటించి మృతి చెందిన విషయం తెలిసిందే.



కౌటాలలో చికిత్స పొందుతున్న నైతం లక్ష్మి

గంజాయి స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న సీఐ

తాండూర్: మండలంలోని రేపల్లెవాడలో బుధవారం గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు ఆసియా సిరామిక్స్ ఫ్యాక్టరీ సమీపంలో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా గంజాయి సేవిస్తున్న ఓ బాలుడు పోలీసులను చూసి పారిపోతుండగా పట్టుకున్నారు. అతని వద్ద నుంచి 50 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. బాలున్ని విచారించగా రాజీవ్‌నగర్‌కు చెందిన తాను బల్లార్షా నుంచి తక్కువ ధరకు గంజాయి తీసుకువచ్చి ఇక్కడ అధిక ధరకు అమ్ముతున్నానని, తాను కూడా తాగుతున్నట్లు అంగీకరించాడు. బాలుడిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

బెల్లంపల్లి: పట్టణంలోని కన్నాలబస్తీ ప్రాంతంలో బుధవారం గంజాయి సేవిస్తూ యువకుడు పట్టుబడినట్లు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో బన్సీలాల్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు కన్నాలబస్తీ ప్రాంతంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా టేకులబస్తీకి చెందిన గుమాస ప్రశాంత్ గంజాయి సేవిస్తూ పట్టుబడ్డాడు. అతని వద్ద 150 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని విచారించగా బల్లార్షా నుంచి తీసుకువచ్చి అమ్ముతున్నట్లు అంగీకరించాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

మద్యం మత్తులో ఆత్మహత్య

కాగజ్‌నగర్‌రూరల్: మద్యం మత్తులో ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై సోనియా తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని లైనుగూడ గ్రామానికి చెందిన బాపురావు (37) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈక్రమంలో బుధవారం మద్యం మత్తులో గుర్తుతెలియని పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతురాలి సోదరి సిత్తుబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.